# రాష్ట్రాన్ని కాపాడే శక్తి కేసీఆర్‌కే ఉంది

- ఆయన లేని తెలంగాణను ఊహించలేం
- తెచ్చుకున్న రాష్ట్రాన్ని రక్షించుకుందాం
- మ్యానిఫెస్టో పథకాలను ఓటర్లకు వివరించాలి
- బీఆర్‌ఎస్ కరీంనగర్ అభ్యర్థి, మంత్రి గంగుల


పార్టీ బూత్ కమిటీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, నవంబర్ 14 : తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడే శక్తి సీఎం కేసీఆర్‌కే ఉందని, ఆయన లేని తెలంగాణను ఊహించలేమని, అందుకే తెచ్చుకున్న తెలంగాణను రక్షించుకోవాల్సిన అవసరం ఉందని కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక పద్మనాయక కల్యాణమండపంలో కరీంనగర్ నియోజకవర్గ బూత్ కమిటీ నాయకులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పదిహేను రోజులు తన కోసం పని చేస్తే ఐదేళ్లు కార్యకర్తలకు సేవ చేస్తానన్నారు. పార్టీ కార్యకర్తలు ఎట్టి పరిస్థితుల్లో వదులుకునే పరిస్థితి ఉండదన్నారు. కేసీఆర్‌ను ఓడించి తెలంగాణను దోచుకోవాలని ఆంధ్రా నాయకులు విషం నింపుకొని హైదరాబాద్‌లో అడ్డా వేశారన్నారు. కాంగ్రెస్, బీజేపీ గెలిస్తే తెలంగాణ మరోసారి దోపిడీకి గురవుతుందని, భవిష్యత్ తరాలు నష్టపోతాయని చెప్పారు. అందుకే, ఈసారి కేసీఆర్‌ను మరోసారి సీఎంను చేసేందుకు ప్రతి కార్యకర్తా కృషి చేయాలన్నారు. బూత్ లెవెల్ సభ్యులు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతి ఓటరును కలిసి అభివృద్ధి, సంక్షేమ పథకాలను, మ్యానిఫెస్టోను వివరించాలని సూచించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే తెలంగాణ రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరి అవుతుందన్నారు. తెలంగాణలో ఈనెల 30న కారు గుర్తుకు ఓటు వేసేలా చూడాలన్నారు. సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ తరఫున బూత్ ఇన్‌చార్జిలు కష్టపడితే అధికారంలోకి వస్తామన్నారు. ప్రతి ఇంటికీ మనం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ మ్యానిఫెస్టోను ఓటర్లకు వివరించాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రం సాధిస్తామని చెప్పామని, సాధించామన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇవ్వలేదని, ఇచ్చే విధంగా చేశామని గుర్తు చేశారు. అప్పుడు దేశంలోని 28పార్టీల నుంచి అనుమతి పత్రాలు తీసుకువచ్చామన్నారు. 2009లో కేసీఆర్ చచ్చుడో... తెలంగాణ వచ్చుడో అని పోరాటం చేస్తేనే కాంగ్రెస్ తెలంగాణ ప్రకటన చేసిందని గుర్తు చేశారు. మళ్లీ వారం రోజుల్లోనే కాంగ్రెస్ వెనక్కి తీసుకుందన్నారు. కాంగ్రెస్ నిజంగానే ఇచ్చేది ఉంటే 2006, 2009లోనే ఇచ్చేదన్నారు. ఈ విషయాలను ప్రజలకు వివరించాలని సూచించారు. పదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించడంతోపాటు అధికారంలో వస్తే చేసే కార్యక్రమాలను కూడా వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులను, మహిళలను, అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని మ్యానిఫెస్టో రూపొందించడం సీఎం కేసీఆర్ కార్యదక్షతను తెలియజేస్తుందన్నారు. సమావేశంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు

### కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో

# అరుదైన శస్త్ర చికిత్స

- 3 కిలోల కణితి తొలగింపు


కరీంనగర్‌లోని కార్ఖానగడ్డకు చెందిన నసీం సుల్తానా కడుపులో నుంచి 3 కిలోల కణితిని తొలగించిన కరీంనగర్ ప్రభుత్వ దవాఖాన వైద్యబృందం

విద్యానగర్, నవంబర్ 14: కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన దవాఖాన వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. కడుపునొప్పితో బాధపడుతున్న ఓ మహిళ కడుపులో నుంచి 3 కిలోల కణితిని తొలగించారు. నగరంలోని కార్ఖానగడ్డకు చెందిన నసీం సుల్తానా (45) కడుపు నొప్పి, రక్తస్రావంతో బాధపడుతూ వారం క్రితం కరీంనగర్ ప్రభుత్వ దవాఖానాలో చేరింది. సుల్తానాకు స్కానింగ్ చేయగా కడుపులో 3 కిలోల కణితి ఉన్నట్లు డాక్టర్లు నిఖత్ పర్వీన్ , మంజుల గుర్తించారు. వెంటనే శస్త్ర చికిత్స చేయాలని బంధువులకు సూచించారు. కుటుంబ సభ్యులు ఒప్పుకోవడంతో మంగళవారం శస్త్ర చికిత్స చేసి కణితిని తొలగించారు. ప్రస్తుతం నసీం సుల్తానా పూర్తిగా కోలుకుందని, ఆరోగ్యంగా ఉందని వైద్యులు తెలిపారు. శస్త్ర చికిత్సలో పాల్గొన్న డాక్టర్ సుధ, సిస్టర్ స్రుజన, మత్తు వైద్యులు శ్రీకాంత్‌రెడ్డిని సుల్తానా కుటుంబ సభ్యులు, దవాఖాన వైద్యులు అభినందించారు.

## బర్రె దాడిలో రైతు మృతి

వీణవంక, నవంబర్ 14 : మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ముదుగంటి రాజిరెడ్డి (50)ని బర్రె దాడిచేయగా అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ ఆసిఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన ముదుగంటి రాజిరెడ్డి మంగళవారం ఉదయం 11 గంటలకు తన బర్రెను ఇంటి పక్కనున్న షెడ్డు దగ్గరకు తోలుకెళ్లి కట్టేస్తుండగా అకస్మాత్తుగా కొమ్ములతో పొడిచింది. దీంతో రాజిరెడ్డి పక్కనున్న రాళ్లపై పడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. రాజిరెడ్డి భార్య ముదుగంటి సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

# అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లోకి


దేశరాజ్‌పల్లిలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్, నవంబర్ 14: ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పార్టీ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దేశరాజ్‌పల్లి, వంగపల్లి, పంగిడిపల్లి గ్రామాల్లో మంగళవారం బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో భారీగా చేరారు. వారికి ఎమ్మెల్సీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో ఎండీ పాషా, ఒగ్గోజు సదయ్య, కృష్ణ, లక్ష్మణ్, బిక్షపతి, కుమార్, సమ్మయ్య, సాంబయ్య, తిరుపతి, వెంకన్న, శ్రీకాంత్, శ్రీనివాస్, వీరేశం, వెంకటేశ్వర్లు, దేవరాజు ముత్తయ్య, దేవరాజు ఇస్తారి, అకునూరి జమీన్, వంగ సందీప్, రామంచ అనిల్, తదితరులున్నారు. సింగిల్ విండో డైరెక్టర్ సత్యనారాయణరావు, బీఆర్‌ఎస్ నాయకులు నకిర్త రాజు, ఎండీ జాఫర్, సర్పంచులు రమేశ్, కమలమ్మ, సారయ్య, ఎంపీటీసీలు రామస్వామి, శైలజానాగేందర్ పాల్గొన్నారు.

# హుజూరాబాద్ కాంగిరేసులో వర్గపోరు

- గ్రూపులతో 'హస్త'వ్యస్తం
- సర్దిచెప్పలేక సతమతమవుతున్న ప్రణవ్
- ఇద్దరు మండల ప్రెసిడెంట్లతో అయోమయంలో కార్యకర్తలు


వీణవంక మండలం మల్లన్నపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల ప్రణవ్‌ను నిలదీస్తున్న నాయకులు, శ్యామ్‌సుందర్‌రెడ్డిని వారిస్తున్న ప్రణవ్

వీణవంక, నవంబర్ 14 : కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో కయ్యం మొదలైంది. వీణవంక మండలంలో ఇరు వర్గాల (గ్రూపు పోరు రోడ్డెక్కింది. దీంతో ఓ మండలాధ్యక్షుడు ఎన్నికల ప్రచార రథం దిగి వెళ్ళిపోయిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని మల్లన్నపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. గత కొన్నేళ్ళుగా మండలానికి అధ్యక్షుడు లేకపోవడంతో ఉప ఎన్నికల తర్వాత పార్టీ కార్యక్రమాలు ఇరువర్గాలు పోటాపోటీగా నిర్వహించారు. దీంతో అధిష్ఠానం మండల కేంద్రానికి చెందిన సాహెబ్ హుస్సేన్‌కు నియామకపత్రం అందజేసిందని ఒక వర్గం, మామిడాలపల్లికి చెందిన శ్యామ్‌సుందర్‌రెడ్డికి నియామకపత్రం అందజేసిందని మరోవర్గం సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టుకున్నారు. దీంతో ఈ విషయం రాష్ట్రస్థాయి నేతల వరకు వెళ్ళినట్టు తెలిసింది. అయితే, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రకటించడంతో సమస్య సద్దుమణుగుతుందని పార్టీ కార్యకర్తలు భావించారు. రోజురోజుకూ నేనంటే నేనని సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టుకుంటున్న ఇద్దరి మధ్య భేదాభిప్రాయాలు మంగళవారం బ్రాహ్మణపల్లిలో జరిగిన ప్రచార సమయంలో బయటపడ్డాయి. ప్రచార రథంపై ఉండగానే చింతల శ్యామ్‌సుందర్‌రెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల ప్రణవ్‌ను మండలాధ్యక్షుడు ఎవరో చెప్పాలంటూ నిలదీశారు. దీంతో అభ్యర్థి ప్రణవ్ శ్యామ్‌సుందర్‌రెడ్డిని ప్రచార రథంపైనే అడుగుతావా? అని వారించాడు. దాంతో సాహెబ్ హుస్సేన్ మొదట ప్రచార రథం దిగి వెళ్ళిపోగా, శ్యామ్‌సుందర్‌రెడ్డితోపాటు అతని వర్గీయులు ప్రచారానికి వెళ్ళకుండా దిగి వెనక్కి వెళ్ళిపోయారు. ఈ సందర్భంగా చింతల శ్యామ్‌సుందర్‌రెడ్డి తనకు నియామకపత్రం అందజేసినప్పటికీ సోషల్ మీడియాలో వర్గాలుగా విడగొడుతున్నారని, అభ్యర్థి వొడితల ప్రణవ్ దృష్టికి తీసుకువెళ్ళినా పీసీసీ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరిస్తానని మాట దాటేస్తున్నాడని తెలిపాడు. కార్యకర్తలకే న్యాయం చేయలేని నాయకుడు ప్రజలకేం చేస్తాడని మండలంలో చర్చ జరుగుతోంది.

## పింఛనిత్తున్న దేవుడు కేసీఆర్


సీఎం కేసీఆర్ ఫొటో ఉన్న కరపత్రానికి మొక్కుతున్న లచ్చవ్వ

గంగాధర, నవంబర్ 14 : మా లాంటి ముసలోళ్లకు పింఛను ఇచ్చి ఆదుకుంటున్న దేవుడు కేసీఆర్ అని మండలంలోని బూరుగుపల్లి గ్రామానికి చెందిన కొలపాక లచ్చవ్వ పేర్కొంది. మల్ల మా ఓటు కారు గుర్తుకే వేసి కేసీఆర్ సారును గెలిపిత్తమని ధీమాగా చెప్పింది. బూరుగుపల్లి గ్రామంలో మంగళవారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. ఈ క్రమంలో కొలపాక లచ్చవ్వను ఓటు వేయాలని బీఆర్‌ఎస్ నాయకులు కోరగా కేసీఆర్ సారు పింఛను ఇచ్చి మాలాంటి ముసలోల్లకు పెద్దకొడుకై సాత్తుండు, అయినకు తప్ప ఎవ్వలకు ఓటు వెయ్యమని స్పష్టం చేసింది.

## తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టొద్దు

- శాతవాహన యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల్ల చైతన్య


మాట్లాడుతున్న శాతవాహన యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చైతన్య

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 14: ఢిల్లీ పాలకుల చేతిలో తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టొద్దని, మన ప్రాంతాన్ని మన ప్రాంతీయ పార్టీలే పాలించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు, శాతవాహన యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల్ల చైతన్య పేర్కొన్నారు. హుజూరాబాద్‌లోని బీఆర్‌ఎస్ ఆఫీసులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల్లా పనిచేసి బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. హుజూరాబాద్ ఉప ఎన్నికలో బీజేపీకి చెందిన ఈటల రాజేందర్‌ను గెలిపించినందుకు రెండేళ్లుగా నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని, అందుకే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్వీ, జేఏసీ నాయకులు శనిగరం అరుణ్‌కుమార్, గడ్డమీద రాజశేఖర్, కుందేటి సత్యనారాయణ, మహిపాల్‌రెడ్డి, ములుకల విజయ్, రాగుల వినయ్, బండ అశోక్, అభిలాష్, మిర్యాల తిరుపతి, నరేశ్, బండారి వెంకటేశ్, అభిషేక్ ఉన్నారు.